27-11-2023 ప్రాత:మురళి ఓంశాంతి "బాప్ దాదా" మధువనం

"మధురమైన పిల్లలూ - పగలు శరీర నిర్వహణార్థము కర్మలు చేయండి, రాత్రివేళ కూర్చొని జ్ఞానాన్ని స్మరించండి, తండ్రిని స్మృతి చేయండి, బుద్ధిలో స్వదర్శన చక్రాన్ని తిప్పండి, అప్పుడు నషా ఎక్కుతుంది"

ప్రశ్న:- మాయ ఏ పిల్లలను స్మృతిలో అసలు కూర్చోనివ్వదు?

జవాబు:- ఎవరి బుద్ధి అయితే ఎవరో ఒకరిలో చిక్కుకుని ఉంటుందో, ఎవరి బుద్ధికైతే తాళం వేయబడి ఉందో, ఎవరైతే చదువును మంచి రీతిలో చదవరో, వారిని మాయ స్మృతిలో కూర్చోనివ్వదు. వారు మన్మనాభవగా ఉండలేరు. ఇక సేవ విషయంలో కూడా వారి బుద్ధి పనిచేయదు. శ్రీమతంపై నడవని కారణంగా పేరును అప్రతిష్ఠపాలు చేస్తారు. మోసం చేసినట్లయితే శిక్షలు కూడా అనుభవించాల్సి ఉంటుంది.

పాట:- నిన్ను పిలవాలని మనసు కోరుకుంటోంది... (తుమ్హారే బులానే కో జీ చాహ్తా హై...)

ఓం శాంతి. పిల్లలు పాటను విన్నారు. ఈ విధంగా గాడ్ ఫాదర్ నే పిలుస్తారు, శ్రీకృష్ణుడిని కాదు. రండి, కంసపురికి బదులుగా మళ్ళీ కృష్ణపురిని తయారుచేయండి అని తండ్రిని పిలుస్తారు. కృష్ణపురిని స్వర్గము అని అంటారు. ఇది ఎవ్వరికీ తెలియదు, ఎందుకంటే శ్రీకృష్ణుడిని ద్వాపరంలోకి తీసుకువెళ్ళారు. ఈ పొరపాటులన్నీ శాస్త్రాల కారణంగా జరిగాయి. ఇప్పుడు తండ్రి యథార్థ విషయాన్ని అర్థం చేయిస్తారు. వాస్తవానికి మొత్తం ప్రపంచానికి పెద్ద - గాడ్ ఫాదర్. అందరూ ఆ ఒక్క భగవంతుడినే స్మృతి చేయాలి. మనుష్యులు క్రైస్టును, బుద్ధుడిని లేక దేవతలు మొదలైనవారిని స్మృతి చేస్తారు, ప్రతి ధర్మంవారు తమ ధర్మ స్థాపకులను స్మృతి చేస్తారు. స్మృతి చేయడమనేది ద్వాపరం నుండి ప్రారంభమైంది. దుఃఖంలో అందరూ స్మృతి చేస్తారు, సుఖములో ఎవ్వరూ స్మృతి చేయరు అని భారత్ లో గాయనం కూడా చేయబడింది. స్మృతి చేసే ఆచారము తర్వాతర్వాత మొదలవుతుంది ఎందుకంటే దుఃఖం ఉంటుంది. మొట్టమొదట భారతవాసులే స్మృతి చేయడాన్ని ప్రారంభించారు. వారిని చూస్తూ ఇతర ధర్మాలవారు కూడా తమ ధర్మ స్థాపకులను స్మృతి చేయడం మొదలుపెడతారు. తండ్రి కూడా ధర్మ స్థాపన చేసేవారే. కానీ మనుష్యులు తండ్రిని మరచి శ్రీకృష్ణుడి పేరు వేసేశారు. లక్ష్మీ-నారాయణుల ధర్మం గురించి వారికి తెలియదు. స్మృతి అనేది లక్ష్మీ-నారాయణులను గాని, శ్రీకృష్ణుడిని గాని చేయకూడదు. ఎవరైతే ఆది సనాతన దేవీ-దేవతా ధర్మాన్ని స్థాపన చేస్తున్నారో, ఆ తండ్రి ఒక్కరినే స్మృతి చేయాలి. మళ్ళీ భక్తి మార్గంలో ఎప్పుడైతే ఈ శివునికి పూజ చేయడం మొదలుపెడతారో అప్పుడు గీతా భగవంతుడు శ్రీకృష్ణుడని భావిస్తారు, వారిని స్మృతి చేస్తారు. వీరిని చూసి ఇతరులు కూడా తమ ధర్మ స్థాపకులను స్మృతి చేస్తారు. ఈ దేవతా ధర్మాన్ని భగవంతుడు స్థాపించారు అన్న విషయాన్ని మర్చిపోతారు. గీత జ్ఞానదాత శ్రీకృష్ణుడు కాదు, శివబాబా అని మనం రాయవచ్చు. వారు నిరాకారుడు - ఇది అద్భుతమైన విషయము కదా. ఎవరి వద్దా శివబాబా పరిచయము లేదు. వారు నక్షత్రము. అన్ని చోట్లా శివుని మందిరాలు ఉన్నాయి కావున వారు అంత పెద్దగా ఉంటారు, అఖండ జ్యోతి తత్త్వము అని భావిస్తారు. కానీ వారు ఆత్మలు ఉండేటువంటి ఆ మహతత్వములో ఉంటారు. ఆత్మ రూపము నక్షత్ర సమానంగా ఉంటుంది, పరమపిత పరమాత్మ కూడా నక్షత్రమే. కానీ వారు జ్ఞాన సంపన్నులు, బీజరూపుడైన కారణంగా వారిలో శక్తి ఉంది. ఆత్మలకు తండ్రి (బీజము) అని పరమాత్ముడినే అంటారు. వారు నిరాకారుడు. మనుష్యులనైతే జ్ఞానసాగరుడు, ప్రేమసాగరుడు అని అనలేరు, అందుకే అర్థం చేయించే పిల్లలలో అథారిటీ ఉండాలి, వారి బుద్ధి విశాలంగా ఉండాలి. మీ అందరిలోనూ ముఖ్యమైనవారు మమ్మా, వందేమాతరం అని గాయనం చేయబడింది. కన్యల ద్వారా బాణాలను వేయించారు. అదర్ కన్య, కుమారి కన్య గురించిన రహస్యము ఎక్కడా లేదు. కేవలం మందిరాల ద్వారానే నిరూపించబడుతుంది. వాస్తవానికి జగదాంబ కూడా ఉన్నారు, కానీ ఆమె ఎవరు అన్నది వారికి తెలియదు.

తండ్రి అంటారు - నేను బ్రహ్మ ముఖకమలం ద్వారా రచయిత మరియు రచనల ఆదిమధ్యాంతాల రహస్యాన్ని తెలియజేస్తాను. డ్రామాలో ఏముంది అన్నది మనుష్యుల బుద్ధిలోకి రావాలి. ఇది అనంతమైన డ్రామా. ఇందులో మనం పాత్రధారులము కావున డ్రామా యొక్క ఆదిమధ్యాంతాల రహస్యము బుద్ధిలో ఉండాలి. ఎవరి బుద్ధిలోనైతే ఇది ఉంటుందో వారికి ఎంతో నషా ఉంటుంది. రోజంతా శరీర నిర్వహణ చేస్తారు, రాత్రి కూర్చొని - ఈ డ్రామా చక్రము ఎలా తిరుగుతుంది అన్నది స్మృతిలోకి తెచ్చుకోండి, ఇదే మన్మనాభవ. కానీ మాయ రాత్రి కూడా కూర్చోనివ్వదు.

పాత్రధారుల బుద్ధిలోనైతే డ్రామా రహస్యము ఉండాలి కదా. కానీ ఇది చాలా కష్టము. ఎక్కడో అక్కడ చిక్కుకున్నట్లయితే బాబా బుద్ధి తాళాన్ని మూసేస్తారు. ఇది చాలా గొప్ప గమ్యము. బాగా చదువుకున్నవారు జీతము కూడా బాగా తీసుకుంటారు కదా. ఇది చదువు. కానీ బయటకు వెళ్ళడంతో మర్చిపోతారు, మళ్ళీ తమ మతంపై నడవడం మొదలుపెడతారు. తండ్రి అంటారు - మధురమైన పిల్లలూ, శ్రీమతంపై నడవడంలోనే మీ కళ్యాణము ఉంది. ఇది పతిత ప్రపంచము, వికారాలను విషము అని అంటారు, దీనిని సన్యాసులు సన్యసిస్తారు. ఈ రావణ రాజ్యం ద్వాపరం నుండే ప్రారంభమవుతుంది, ఈ వేద-శాస్త్రాలు మొదలైనవన్నీ భక్తి మార్గపు సామాగ్రి. సేవ కొరకు పిల్లల బుద్ధి నడవాలి. శ్రీమతంపై నడిచినట్లయితే ధారణ కూడా జరుగుతుంది. వినాశనము ఎదురుగా నిలబడి ఉందని పిల్లలకు తెలుసు. ఓ భగవంతుడా, దయ చూపించండి అని దుఃఖంతో మొరపెట్టుకుంటారు. ఆర్తనాదాలు చేసే సమయంలో భగవంతుడిని తలుచుకుంటారు. పార్టిషన్ సమయంలో - ఓ భగవంతుడా, దయ చూపించండి, రక్షించండి అని ఎంతగా తలుచుకునేవారు. ఇప్పుడు ఏ విధంగా రక్షించాలి? రక్షించేవారి గురించే తెలియనప్పుడు ఎలా రక్షిస్తారు? ఇప్పుడు తండ్రి వచ్చారు, కానీ కష్టం మీద ఏ కొందరి బుద్ధిలోనో కూర్చుంటుంది. ఈ-ఈ విధంగా సేవ చేయండి అని తండ్రి అర్థం చేయిస్తారు. ఈ శ్రీమతం తండ్రి నుండి లభిస్తుంది. ఇటువంటి తండ్రిని గుర్తించలేకపోతారు, ఇది కూడా ఎంతటి ఆశ్చర్యము! ఇవి ఎంతగా అర్థం చేసుకోవలసిన విషయాలు! రోజంతా శివబాబా స్మృతి బుద్ధిలో ఉండాలి. ఇతను కూడా వారి రథము, సహచరుడు కదా!

బాబా చూస్తారు - పిల్లలు ఈ రోజు మంచి నిశ్చయబుద్ధి కలవారిగా ఉంటారు, రేపు సంశయబుద్ధి కలవారిగా అయిపోతారు. మాయా తుఫానులు రావడంతో అవస్థ పడిపోతే ఇందులో బాబా ఏం చేయగలరు. మీరు జ్ఞానంలోకి వచ్చారు, సరెండర్ అయ్యారు అంటే మీరు ట్రస్టీ అయినట్లు. మీరు ఎందుకు చింతిస్తున్నారు? సరెండర్ చేసిన తర్వాత సేవ కూడా చేసినట్లయితే ప్రతిఫలం లభిస్తుంది. ఒకవేళ సరెండర్ అయ్యి, సేవ చేయకపోయినా కూడా, వారికి తినిపించాల్సి అయితే ఉంటుంది, కావున ఆ ధనం నుండే తింటూ-తింటూ తమదంతా సమాప్తం చేసేసుకుంటారు, సేవ చేయరు. మీరు మనుష్యులను వజ్రతుల్యంగా తయారుచేసే సేవ చేయాలి. ముఖ్యంగా బాబా యొక్క ఆత్మిక సేవను చేయాలి, దాని ద్వారా మనుష్యులు ఉన్నతముగా అవుతారు. సేవ చేయకపోతే వెళ్ళి దాస-దాసీలుగా అవుతారు. ఎవరైతే చదువును బాగా చదువుతారో, వారికి గౌరవం కూడా గొప్పగా ఉంటుంది, ఎవరైతే ఫెయిల్ అవుతారో వారు వెళ్ళి దాస-దాసీలుగా అవుతారు.

తండ్రి అంటారు - పిల్లలూ, నన్ను స్మృతి చేయండి మరియు వారసత్వాన్ని తీసుకోండి. ఈ మన్మనాభవ అన్న పదమే రైట్. జ్ఞానసాగరుడు ఏమంటారంటే - నన్ను స్మృతి చేసినట్లయితే మీ వికర్మలు వినాశనమవుతాయి. శ్రీకృష్ణుడు ఈ విధంగా అనలేరు, తండ్రియే అంటారు - నన్ను ఒక్కరినే స్మృతి చేయండి మరియు భవిష్య రాజ్య పదవిని స్మృతి చేయండి. ఇది రాజయోగము కదా. దీని ద్వారా ప్రవృత్తి మార్గం నిరూపించబడుతుంది. ఇది మీరే అర్థం చేయించగలరు. మీలో కూడా ఎవరైతే సర్వీసబుల్ గా, చురుకుగా ఉంటారో, వారినే పిలవడం జరుగుతుంది. వీరు చురుకైన హ్యాండ్ అని అర్థం చేసుకోవడం జరుగుతుంది. పిల్లలు యోగయుక్తముగా అవ్వాలి. ఒకవేళ శ్రీమతంపై నడవకపోతే పేరును అప్రతిష్ఠపాలు చేస్తారు. మోసం చేసినట్లయితే శిక్షలు అనుభవించాల్సి ఉంటుంది. ట్రిబ్యునల్ (న్యాయసభ) కూడా కూర్చుంటుంది కదా! అచ్ఛా!

మధురాతి-మధురమైన సికీలధే పిల్లలకు మాత-పిత బాప్ దాదాల ప్రియస్మృతులు మరియు గుడ్ మార్నింగ్. ఆత్మిక పిల్లలకు ఆత్మిక తండ్రి నమస్తే.

రాత్రి క్లాసు

పిల్లలు మొట్టమొదట తండ్రి గురించి అర్థం చేయించాలి. అనంతమైన తండ్రియే మనల్ని చదివిస్తారు. గీతను చదివే శ్రీకృష్ణుడిని భగవంతుడని అంటూ ఉంటారు. భగవంతుడు అని నిరాకారుడినే అంటారని వారికి అర్థం చేయించాలి. దేహధారులైతే ఎందరో ఉన్నారు, దేహము లేకుండా ఉన్నది ఒక్కరే. వారే ఉన్నతోన్నతమైన శివబాబా. ఈ విషయాన్ని మంచి రీతిలో బుద్ధి కూర్చోబెట్టండి. అనంతమైన తండ్రి నుండి అనంతమైన వారసత్వం లభిస్తుంది, వారే ఉన్నతోన్నతమైన నిరాకార పరమపిత పరమాత్మ. వారు అనంతమైన తండ్రి మరియు వీరు హద్దులోని తండ్రి. ఇంకెవ్వరూ ఇలా 21 జన్మల వారసత్వాన్ని ఇవ్వరు. అలాగే అమర పదవిని ప్రాప్తింపజేసే తండ్రి కూడా ఇంకెవ్వరూ లేరు. అమరలోకము సత్యయుగము, ఇది మృత్యులోకము. కావున తండ్రి పరిచయాన్ని ఇవ్వడం ద్వారా అర్థం

చేసుకుంటారు, తండ్రి నుండి వారసత్వం లభిస్తుంది, దానిని దైవీ స్వరాజ్యమని అంటారు. అది తండ్రియే ఇస్తారు. వారే పతిత-పావనుడిగా గానం చేయబడతారు, వారు అంటారు - స్వయాన్ని ఆత్మగా భావిస్తూ తండ్రినైన నన్ను స్మృతి చేసినట్లయితే పాపాలు కట్ అయిపోతాయి, పతితుల నుండి పావనులుగా అయి పావన ప్రపంచంలోకి వెళ్ళేందుకు యోగ్యులుగా అవ్వగలుగుతారు. కల్ప-కల్పమూ తండ్రి చెప్తారు - నన్నొక్కరినే స్మృతి చేయండి. స్మృతియాత్ర ద్వారానే పవిత్రంగా అవ్వాలి. ఇప్పుడు పావన ప్రపంచము వస్తుంది. పతిత ప్రపంచం వినాశనమవ్వనున్నది. మొట్టమొదట తండ్రి పరిచయాన్ని ఇచ్చి పక్కా చేయాలి. ఎప్పుడైతే తండ్రిని పక్కాగా అర్థం చేసుకుంటారో, అప్పుడే తండ్రి నుండి వారసత్వం లభిస్తుంది. ఇందులో మాయ ఎంతగానో మరపింపజేస్తుంది. బాబాను స్మృతి చేయడానికి మీరు ప్రయత్నిస్తారు, మళ్ళీ మర్చిపోతారు. శివబాబాను స్మృతి చేయడం ద్వారానే పాపాలు కట్ అవుతాయి. ఆ బాబా వీరి ద్వారా చెప్తారు - పిల్లలూ, నన్ను స్మృతి చేయండి. అయినా మళ్ళీ వ్యాపార-వ్యవహారాలలో పడి మర్చిపోతారు. ఇది మర్చిపోకూడదు, ఇదే శ్రమతో కూడుకున్న విషయము. తండ్రిని స్మృతి చేస్తూ-చేస్తూ కర్మాతీత అవస్థ వరకు చేరుకోవాలి. కర్మాతీత అవస్థ కలవారిని ఫరిశ్తా అని అంటారు. ఎవరికైనా ఎలా అర్థం చేయించాలి అన్నది పక్కాగా గుర్తుంచుకోండి. మేము సోదరులకు (ఆత్మలకు) అర్థం చేయిస్తున్నాము అన్నది కూడా పక్కా నిశ్చయం ఉండాలి. అందరికీ తండ్రి సందేశాన్ని ఇవ్వాలి. కొంతమంది - తండ్రి వద్దకు వెళ్ళాలి, సాక్షాత్కారము పొందాలి అని అంటారు. కానీ ఇందులో సాక్షాత్కారాలు మొదలైనవాటి విషయమేమీ లేదు. భగవంతుడు వచ్చి నేర్పిస్తారు మరియు నోటితో చెప్తారు - మీరు నిరాకార తండ్రినైన నన్ను స్మృతి చేయండి. స్మృతి చేయడం ద్వారా పాపాలన్నీ కట్ అయిపోతాయి. ఎక్కడైనా కూడా, వ్యాపార-వ్యవహారాలు మొదలైనవాటిలో కూర్చుని కూడా ఘడియ-ఘడియ తండ్రిని స్మృతి చేయాలి. నన్ను స్మృతి చేయండి అని తండ్రి ఆజ్ఞను ఇచ్చారు. నిరంతరం స్మృతి చేసేవారే విజయులుగా అవుతారు. స్మృతి చేయకపోతే మార్కులు తగ్గిపోతాయి. ఈ చదువు ఉన్నదే మనుష్యుల నుండి దేవతలుగా తయారయ్యేందుకు, దీనిని ఒక్క తండ్రియే చదివిస్తారు. మీరు చక్రవర్తి రాజులుగా అవ్వాలనుకుంటే 84 జన్మల చక్రాన్ని కూడా స్మృతి చేయాలి. కర్మాతీత అవస్థ వరకు చేరుకునేందుకు కష్టపడాలి. అంతిమంలో అలా అవుతారు. ఆ అంతిమము అనేది ఏ సమయంలోనైనా రావచ్చు. అందుకే పురుషార్థము నిరంతరమూ చేయాలి. నిత్యము మీ పురుషార్థము నడుస్తూ ఉండాలి. లౌకిక తండ్రి మీతో - దేహపు సర్వ సంబంధాలను వదిలి స్వయాన్ని ఆత్మగా భావించండి అని చెప్పరు. శరీర భానాన్ని వదిలి నన్ను స్మృతి చేసినట్లయితే పాపాలు అంతమవుతాయి, మీరు సతోప్రధానంగా అయిపోతారు. ఈ వ్యాపారాన్ని అయితే సంతోషంగా చేయాలి కదా. భోజనం చేస్తున్న సమయంలో కూడా తండ్రిని స్మృతి చేయాలి. స్మృతిలో ఉండే గుప్తమైన అభ్యాసము పిల్లలైన మీది నడుస్తూ ఉన్నట్లయితే ఎంతో మంచిది. అందులో మీ కళ్యాణమే ఉంది. బాబాను ఎంత సమయం స్మృతి చేస్తున్నాను అని స్వయాన్ని చూసుకోవాలి.

అచ్ఛా! మధురాతి-మధురమైన సికీలధే పిల్లలకు ప్రియస్మృతులు మరియు గుడ్ నైట్. ఓం శాంతి.

ధారణ కొరకు ముఖ్య సారము:-

1. మనుష్యులను వజ్రతుల్యముగా తయారుచేసే ఆత్మిక సేవను చేయాలి. ఎప్పుడూ కూడా సంశయబుద్ధి కలవారిగా అయి చదువును వదిలేయకూడదు. ట్రస్టీలుగా అయి ఉండాలి.

2. శరీర నిర్వహణార్థము కర్మలు చేస్తూ కూడా తండ్రిని స్మృతి చేయాలి. శ్రీమతములో తమ కళ్యాణము ఉందని భావిస్తూ ముందుకు వెళ్తూ ఉండాలి. తమ మతాన్ని అనుసరించకూడదు.

వరదానము:- మనసా మరియు వాచా శక్తులను యథార్థ మరియు సమర్థ రూపములో కార్యములో వినియోగించే తీవ్ర పురుషార్థీ భవ

తీవ్ర పురుషార్థీలు అనగా ఫస్ట్ డివిజన్ లోకి వచ్చే పిల్లలు తమ సంకల్ప శక్తిని మరియు వాణి శక్తిని యథార్థ మరియు సమర్థ రీతిలో కార్యములో వినియోగిస్తారు. వారు ఇందులో ఢీలాగా ఉండరు. వారికి - తక్కువగా మాట్లాడండి, నెమ్మదిగా మాట్లాడండి మరియు మధురంగా మాట్లాడండి అనే ఈ స్లోగన్ సదా గుర్తుంటుంది. వారి ప్రతి మాట యోగయుక్తంగా, యుక్తియుక్తంగా ఉంటుంది. వారు అవసరమైన మాటలనే మాట్లాడుతారు, వ్యర్థమైన మాటలు, విస్తారమైన మాటలు మాట్లాడి తమ శక్తిని సమాప్తము చేసుకోరు. వారు సదా ఏకాంతప్రియులుగా ఉంటారు.

స్లోగన్:- ఎవరైతే నాది అనే భావము యొక్క అధికారాన్ని కూడా త్యాగము చేస్తారో, వారే సంపూర్ణ

నష్టోమోహులు.

మాతేశ్వరిగారి మధుర మహావాక్యాలు

"మనసులోని అశాంతికి కారణము కర్మబంధనము మరియు శాంతికి ఆధారము కర్మాతీతము"

వాస్తవానికి ప్రతి మనిషికి - మా మనసుకు శాంతి ప్రాప్తించాలి అనే ఈ కోరిక తప్పకుండా ఉంటుంది, అందుకే అనేక ప్రయత్నాలు చేస్తూ వచ్చారు కానీ మనసుకు శాంతి ఇప్పటివరకు ప్రాప్తించలేదు, దీనికి యథార్థమైన కారణము ఏమిటి? ఇప్పుడు మొదటైతే ఈ ఆలోచన తప్పకుండా నడవాలి - మనసులోని అశాంతికి మూల కారణమేమిటి? మనసులోని అశాంతికి ముఖ్యమైన కారణము - కర్మబంధనాలలో చిక్కుకోవటము. ఎప్పటివరకైతే మనిషి ఈ పంచ వికారాలనే కర్మబంధనాల నుండి విముక్తి అవ్వడో, అప్పటివరకు మనిషి అశాంతి నుండి విముక్తి అవ్వలేడు. ఎప్పుడైతే కర్మబంధనాలు తెగిపోతాయో, అప్పుడు మనసుకు శాంతిని అనగా జీవన్ముక్తిని పొందగలడు. ఇప్పుడు ఆలోచించాలి - ఈ కర్మబంధనాలు ఎలా తెగిపోతాయి? మరియు వీటి నుండి విడిపించేవారు ఎవరు? ఏ మనుష్య ఆత్మ ఇంకే ఇతర మనుష్యాత్మకు విముక్తిని ఇవ్వలేదని మనకు తెలుసు. ఈ కర్మబంధనాల యొక్క లెక్కాచారాన్ని తెంచేవారు కేవలము ఒక్క పరమాత్మ మాత్రమే, వారే వచ్చి ఈ జ్ఞాన-యోగ బలము ద్వారా కర్మబంధనాల నుండి విడిపిస్తారు, అందుకే పరమాత్మను సుఖదాత అని అంటారు. ఎప్పటివరకైతే మొదట ఈ జ్ఞానం ఉండదో - నేను ఆత్మను, నిజానికి నేను ఎవరి సంతానాన్ని, నా అసలైన గుణము ఏమిటి, ఎప్పుడైతే ఇవన్నీ బుద్ధిలోకి వస్తాయో అప్పుడే కర్మబంధనాలు తెగిపోతాయి. ఇప్పుడు ఈ జ్ఞానం మనకు పరమాత్మ ద్వారానే ప్రాప్తిస్తుంది అనగా పరమాత్మ ద్వారానే కర్మబంధనాలు తెగిపోతాయి. అచ్ఛా! ఓం శాంతి.